క్లుప్తంగా

ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సూచించారు. స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన ఆదివారం పరిశీలించి, పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. బినామీలను విధుల్లోకి తీసుకోవద్దన్నారు. అందరూ బాగా పనిచేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

పుస్తక పఠనంతో మేలు



విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, ఇది ఎంతో మేలు చేస్తుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులతో లైబ్రేరియన్ పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజూ పుస్తకాలు చదవడం ద్వారా మంచి జ్ఞానం కలుగుతుందన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

వైద్యం.. దయనీయం!



ఆస్పత్రి వరండాలోనే బెడ్లు, బెంచీలపై రోగులకు వైద్యసేవలు

బాడంగి: స్థానిక సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)లో వైద్యం.. దయనీయంగా మారింది. రోగులకు అవసరమైన వసతులు లేకపోవడంతో పాటు వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇప్పటికీ వరండాలోనే పలువురు రోగులకు వైద్యం అందిస్తున్న దుస్థితి. ముఖ్యంగా సరిపడ వైద్యులు ఆస్పత్రిలో లేకపోవడంతో రోగులకు సకాలంలో వైద్యం అందడం లేదు. దీంతో పాటు సరిపడ బెడ్లు కూడా లేకపోవడంతో వరండాలోని రోగుల బంధువులు కూర్చొనే బెంచీలపై రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. గతంలోని ఇదే 30 పడకల ఆస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా మార్చారు. అయినా ఆ స్థాయి ఆస్పత్రికి సరిపడ సేవలు లేవన్న విమర్శలు రోగుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఆస్పత్రి సేవలు మెరుగుపరచాలని కోరుతున్నారు.

సత్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయి..



రంగనాథంను సన్మానిస్తున్న స్నేహం అసోసియేషన్ సభ్యులు

రాజాం సిటీ: వివిధ రంగాల్లో పలువురి విశేష కృషిని అభినందిస్తూ వారికి చేసే సత్కారాలు వారిపై మరింత బాధ్యతను పెంచుతాయని టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక పట్టణంలో స్నేహం అసోసియేషన్ కార్యాలయంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉగాది పురస్కారం పొందిన రారవే(రాజాం రచయితల వేదిక) నిర్వాహకులు గార రంగనాథంతో పాటు సీఐ అశోక్‌కుమార్, పోయిన బ్యాగును 24 గంటల్లో కనిపెట్టి తీసుకువచ్చిన పోలీసులు శేఖర్, సంతోష్‌లను ఆదివారం సన్మానించారు. తమను గుర్తించి గౌరవిస్తున్నందుకు కృతజ్ఞతలని స్నేహం అసోసియేషన్‌కు సన్మాన గ్రహీతలు తెలిపారు. కార్యక్రమంలో కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, బీవీ అచ్యుత్‌కుమార్, పొట్నా వెంకటేశ్వరగుప్తా, పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన చిరువ్యాపారి వారణాశి జగన్నాథ స్వామి తన ఔదార్యం చాటుకుంటున్నారు. 1500 రోజులుగా నిత్యాన్నదానం కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ 20 మంది అనాథలకు భోజనాలు వండిపెడుతున్నారు. ఓ వైపు తన కుటుంబాన్ని పోషించుకుంటూనే తన సంపాదనలో కొంత మొత్తాన్ని ఇలా పేదల కోసం ఖర్చు చేస్తున్నారు. ఇలా చేస్తుండడం తనకు ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.

సమస్యల వలయంలో..

గిరిజన ఆశ్రమ పాఠశాల!

- నేరెళ్లవలస పాఠశాలలో మౌలిక వసతులు కరువు
- వరండాలోనే తరగతుల నిర్వహణ
- తరగతి గదుల్లోనే విద్యార్థుల నిద్ర
- శిథిలావస్థలో స్నానపు గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



నేరళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాల



అధ్వానంగా ఉన్న విద్యార్థుల స్నానపు గదులు



వరండాలోనే తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం



తరగతి గదిలోనే ఇలా విద్యార్థుల బెడ్లు..

రామభద్రపురం: ఓ నాడు.. ఓ వెలుగు వెలిగిన గిరిజన ఆశ్రమ పాఠశాలలు నేడు కునారిల్లుతున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అవి ఇప్పుడు అనాథ పాఠశాలలుగా తయారయ్యాయి. ఏ పాఠశాలలోనూ మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో లేవు. దీనికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.. రామభద్రపురం మండలం, జన్నివలస పంచాయతీ, నేరళ్లవలస గ్రామ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల. ఇదే పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మొత్తం 110 మంది ఉన్నారు. అయితే వారి చదువులు సమస్యల మధ్య కొనసాగుతున్నాయి. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలేవీ లేవు. ముఖ్యంగా ఇక్కడి విద్యార్థుల భోజనాలకు సంబంధించి, మెనూ సక్రమంగా అమలు చేయడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు మౌలిక వసతుల లేమి విద్యార్థులను తీవ్రంగా వేధిస్తుంటే మరోవైపు ఉపాధ్యాయులు కూడా సమయానికి పాఠశాలకు హాజరుకాకపోవడంతో విద్యాబోధన కుంటుపడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే అక్కడి విద్యార్థులకు ఇవ్వాల్సిన ట్రంకు పెట్టెలు, బెడ్‌లు, బెడ్‌షీట్లు, పళ్లాలు, గ్లాసుల విషయంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం వహిస్తుండడంతో తమ బాధలు ఎవరికి చెప్పుకోవాలని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉక్కపోతలోనే తరగతులు..

విద్యార్థులకు సరిపడ తరగతి గదులు లేకపోవడంతో వరండాలోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉంటే అవే తరగతి గదులను విద్యార్థులు పడుకునే గదులుగా వినియోగిస్తున్నారు. ఆయా గదుల్లో సరిపడ ఫ్యాన్లు కూడా లేకపోవడంతో ప్రస్తుత వేసవిలో ఉక్కపోతలోనే విద్యార్థుల తరగతులు, నిద్ర కొనసాగుతున్నాయి. ఎప్పుడో ఇచ్చిన బెడ్‌షీట్లు కింద పరుచుకుని పడుకుంటున్నామని, దోమలు విపరీతంగా కుడుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.

అధ్వానంగా తరగతి గదులు..

ప్రధానంగా ఈ పాఠశాలలోని మొత్తం నాలుగు తరగతుల గదులు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయి. భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు భవనాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈ అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న కుళాయిల ద్వారా వచ్చే నీటిని విద్యార్థులు తాగుతుండడం విచారకరం. స్థానికంగా ఉండాల్సిన వార్డెన్ కూడా ఇక్కడ ఉండకపోగా, సంబంధిత అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతోనే ఇలాంటి పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

సమస్యలను అధికారుల దృష్టిలో పెట్టాం..



ఇక్కడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం జరిగింది. తరగతి గదుల కొరత, డార్మెటరీలు లేకపోవడం, కొన్ని క్లాస్ రూమ్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయన్న విషయాలను తెలియజేశాం. ఉన్నతాధికారులు కూడా పరిశీలనకు ఇక్కడికి వచ్చి, వెళ్లారు. నిధులు మంజూరు కాగానే మౌలిక వసతులు మెరుగుపరుస్తాం.

–జి.కృష్ణారావు, ప్రధానోపాధ్యాయుడు, నేరళ్లవలస గిరిజన ఆశ్రమ పాఠశాల

లోక రక్షకుడు ఏసుక్రీస్తు



వంగరలో ఏసుక్రీస్తు శ్రమలు స్మరించుకుంటూ క్రైస్తవుల ఊరేగింపు



రామభద్రపురంలో మట్టల ఆదివారం పండగ చేసుకుంటున్న మతవిశ్వాసకులు



మట్టల ఆదివారం సందర్భంగా బొబ్బిలిలో క్రైస్తవ సోదరుల ఊరేగింపు



బాడంగి: చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు



తెర్లాంలోని క్రీస్తు ప్రార్థనా మందిరంలో మట్టల ఆదివారం పండగ జరుపుకుంటున్న చిన్నారులు

వాడవాడలా మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇదే రోజున ఏసుక్రీస్తు యెరూషలేం పట్టణానికి రాజుగా జయప్రవేశం చేయగా అక్కడి వారంతా వివిధ పుష్పాలతో అలంకరించిన కర్జూరపు మట్టలు చేత పట్టుకుని, వస్త్రాలు నేలపై పరిచి ఘనస్వాగతం పలుకుతారు. ఈ సందర్భం పురస్కరించుకుని, క్రైస్తవులంతా మట్టల ఆదివారం పండగ చేసుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కర్జూరపు మట్టలు, ఈతకొమ్మలు, కొబ్బరిమట్టలు చేతపట్టి వీధుల్లో ఊరేగుతూ జీసస్ శ్రమలను తలుచుకుని, ఆరాధన గీతాలు ఆలపించారు. యూదుల రాజుకు జేజేలు అని స్వాగతం పలికారు. ఏసుక్రీస్తు లోకరక్షకుడని, కరుణామయుడు, దయామయుడైన ఆయన బోధనలు శాంతి, సమాధానం చేకూరుస్తాయని ఫాదర్‌లు తెలిపారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష



రేగిడి: ఉంగరాడమెట్ట గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు



బాడంగి: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి

రేగిడి/వంగర/బాడంగి: మండలాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లలో ప్రవేశాలకు సంబంధించి, పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు జరిగాయి. రేగిడి మండలంలోని ఉంగరాడ మెట్ట పాఠశాలలో జరిగిన ఐదో తరగతి పరీక్షకు 52 మంది, ఇంటర్మీడియట్ పరీక్షకు 56 హాజరయ్యారు. వంగర మండలంలోని మద్దువలసలో ఉన్న పాఠశాలలో జరిగిన ఐదో తరగతి పరీక్షకు 47 మంది, ఇంటర్మీడియట్ పరీక్షకు 91 మంది హాజరయ్యారు. అలాగే బాడంగి మండల కేంద్రంలోని పాఠశాల వద్ద జరిగిన పరీక్షకు 106 మంది ఐదో తరగతి పరీక్ష రాయడానికి, మరో 101 మంది ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష రాయడానికి వచ్చినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు.

తాగునీటికి అవస్థలు



మంచినీటి ట్యాంకు లీకవుతుందని చూపిస్తున్న నేరళ్లవలస గ్రామవాసి

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీలోని మధుర గ్రామమైన నేరళ్లవలస గిరిజన గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వాటర్ ట్యాంకు పూర్తిగి శిథిలావస్థకు చేరి, దాని అడుగుభాగం నీరు లీకవుతోంది. దీంతో తాగునీరు చాలక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకు నుంచి ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయి పైపులకు కూడా లీకులు ఉండడంతో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా తమ బాధలు పట్టించుకోవడం వాపోతున్నారు. ఇప్పటికైనా కొత్త తాగునీటి ట్యాంకు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.



ఇంటికి వేసిన కుళాయి పైపు నుంచి నీరు లీకవుతోందని చూపిస్తున్న గిరిజన మహిళ

నేలబావి ఆక్రమణ అడ్డగింత





బొబ్బిలి పట్టణంలోని చర్చి రోడ్డు దగ్గర వరహాగిరి వీధిలోని పురాతన కాలం నాటి నేలబావిని సాలూరుకు చెందిన ఓ రియల్టర్ ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు ఆదివారం అడ్డుకున్నారు. చాలా ఏళ్లుగా ఇదే బావి నీటిని వాడుకనీటి కోసం అక్కడి వారు వినియోగిస్తున్నారు. అయితే అదే ప్రాంతంలోని స్థలాన్ని సదరు రియల్టర్ కొనుగోలు చేసి, అక్కడున్న ఈ బావిని కప్పిపూడ్చేందుకు సిద్ధమయ్యాడు. పనివాళ్లను పెట్టి ఆ పనిని వారికి అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బావి కప్పివేసే పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు అక్కడికి చేరుకుని, స్థానికులను ఆరాతీయగా ఈలోపు అక్కడి నుంచి పనివారు మెల్లగా జరుకోవడం విశేషం.

–బొబ్బిలి

బోరు బాగుచేయరూ?



తెర్లాం మండలం, మోదుగువలస గ్రామ ఎస్సీ కాలనీలోని బోరు పాడైంది. దీంతో ఆ కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని వేరేచోట ఉన్న బోరుకు వెళ్లి, నీరు తెచ్చుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు మరమ్మతులకు గురై ఏడాది కావస్తున్నా ఇంతవరకు ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని, కనీసం క్రాస్‌ప్రోగ్రాం కింద అయినా తమ బోరు బాగు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

–తెర్లాం

కుచించుకుపోతున్న ఏకేఎల్ గెడ్డ



రేగిడి మండలం, వెంకంపేట దగ్గరున్న ఏకేఎల్ గెడ్డ రోజురోజుకూ కుచించుకుపోతోంది. 200 మీటర్ల వెడల్పు ఉండే ఈ గెడ్డ ప్రస్తుతం 50 మీటర్లు కూడా లేని పరిస్థితి. ఆక్రమణల కారణంగానే గెడ్డ విస్తీర్ణం తగ్గిపోయిందని, దీంతో సాగునీరు సక్రమంగా సరఫరా అవ్వకపోవడంతో బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలు తొలగించి, గెడ్డ బాగు చేయాలని పలుమార్లు రైతులు విన్నవించుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. ఇప్పటికైనా గెడ్డకు పూర్వవైభవం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–రేగిడి

ముగిసిన పగడాలమ్మ జాతర మహోత్సవాలు



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చొన్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్న దృశ్యం



సంగిడీ ఎత్తుతున్న గౌరినాయుడు

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామంలో కొన్నిరోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న పగడాలమ్మ జాతర మహోత్సవాలు ముగిశాయి. ఆదివారం జాతర చివరి రోజు కావడంతో వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం జిల్లా స్థాయి సంగిడీల పోటీలు నిర్వహించగా, నిమ్మాడ, ఒప్పంగి గ్రామాల నుంచి పోటీదారులు పోటీల్లో పాల్గొని తమ సత్తా చాటారు. ఎంతో ఆసక్తికరంగా సాగిన ఈ పోటీలను చూసేందుకు గ్రామస్తులు ఎగబడ్డారు.

వంగర: మండలంలోని కొప్పర గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఆదివారం హోమం, తదితర పూజలు చేశారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావునాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

బొబ్బిలిరూరల్: మండలంలోని పెంట గ్రామ వేగావతి నది ఒడ్డున వెలసిన అన్నపూర్ణ సహిత నగిరేశ్వరస్వామి ఆలయంలో చైత్ర పౌర్ణమి పూజలు శనివారం రాత్రి చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక దీపారాధన, ప్రత్యేక పూజలు చేపట్టారు.

తెర్లాం: మండలంలోని వి.చిన్నయ్యపేట గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు.

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని నెయ్యిలు, యాత వీధుల ప్రజల ఇలవేల్పు మజ్జిగౌరమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు.



వంగర: పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బెల్లాన, డాక్టర్ తలే రాజేష్